మంగళగిరికి తరలి వెళ్ళిన టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం మన్యంజిల్లాలోని ఎన్నికైన నలుగురు ఎమ్మెల్యేలు బుధవారం సాయంత్రం బయలుదేరి మంగళగిరి వెళ్లారు. పార్వతీపురం నుండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచిన బోనెల విజయ్ చంద్ర, సాలూరు నుండి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచిన గుమ్మడి సంధ్యారాణి, కురుపాం నుండి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచిన తోయక జగదీశ్వరి, పాల కొండ నుండి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచిన నిమ్మక జయకృష్ణలు అధినేత పిలుపుమేరకు విజయ వాడ వెళ్లారని స్థానిక నేతలు తెలిపారు. గెలిచిన తర్వాత గత 24 గంటల్లో కార్యకర్తలు, నేతలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున వారిని కలిసి అభి నందనలు తెలియజేయడంతో వారివారి గృహాలు, పార్టీ కార్యాలయాలు సందడితో నెల కొన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు కూడా మొదటిసారి శాసనసభలో అడుగు పెడుతున్నవారే. సాలూరు నుండి ఎంఎల్ఏగా గెలిచిన గుమ్మడి సంధ్యారాణి గతంలో ఎమ్మెల్సీగా, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలుగా, అడుగుపెట్టనున్నారు.

అధికారులకు, సిబ్బందికి ఐటీడీఏ పీఓ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : 2024సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేశారని అప్పగించిన బాధ్యతల్ని అత్యంత అంకితభావంతో నిర్వర్తించారని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించారని, ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. పోలింగ్,పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ విజయవంతం చేశారని అన్నారు. ఈ మేరకు బుధవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాల వెల్లడి వరకు ఎన్నో రకాల ప్రక్రియల్లో అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం అయ్యారని, అవిశ్రాంత పని చేశారని పేర్కొన్నారు. జూన్ 04వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఉదయం నుంచే అందరూ తమ విధులను అంకితభావంతో నిర్వర్తించి నిర్ణీత సమయానికి ఫలితాలను వెల్లడిం చడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని ఏఆర్వోలు, వారి పరిధిలోని సిబ్బంది మంచి పనితీరు కనబరిచారని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను, ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించారని కితాబిచ్చారు. నివేదికల తయారీలో కింది స్థాయి సిబ్బంది కూడా ఉత్సాహంగా పని చేశారని, అలాగే ఫలితాల వెల్లడి రోజున మీడియా సెంటర్ ద్వారా సంబంధిత అధికారులు, సిబ్బంది విస్తృత సేవలందించారని.. మీడియాకు అవసరమైన సమాచారం, రిపోర్టులు నిర్ణీత సమయంలో అందజేశారని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించిందని ఈ ప్రకటన ద్వారా మీడియా ప్రతినిధులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపు తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రతువుకు అన్ని విధాలుగా సహకరించిన రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, వెనకుండి నడిపించిన ఎన్నికల పరిశీలకులకు, ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందజేసిన ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వర రావు,అరకు వ్యాలీ తహసీల్దార్లు సుధాకర్, సోమేశ్వరరావు నియోజక వర్గంలో తహసీల్దార్లులకు, కృతజ్ఞతలు తెలిపారు. ఓటర్లు అత్యంత ఉత్సాహం ప్రదర్శించి తమ ఓటు హక్కును వినియోగించుకొని వారి బాధ్యతను నిర్వర్తించారని గుర్తు చేశారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటా...ప్రజా సమస్యల పరిష్కారానికై కృషి చేస్తా

మాజీ శాసనసభ్యులు జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : గత ఐదేళ్లుగా పార్టీ వెన్నంటి నిలిచి తనతో నడుస్తున్న ప్రతీ ఒక్క వైసిపి నాయకుడికి, కార్యకర్తకు అండగా నిలిచి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాననిమాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు అన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో వెలువడిన ప్రజా తీర్పును స్వాగతిస్తూ, ప్రజా తీర్పుకు శిరసా వహిస్తూ మన్యం జిల్లా నూతన శాసనసభ్యులకు, అరుకు పార్లమెంట్ ఎంపీ తనూజా రాణి కి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో తనని కలవడానికి విచ్చేసిన వైసీపీ శ్రేణులతో కలిసి సమావేశంలో మాట్లాడుతూ ఎల్లవేళలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నంటి నిలిచిన ప్రతీ ఒక్క వైసిపి ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, జగనన్న అభిమానులకు, వైయస్అర్ ఆశయ సాధకులకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ మీ అందరి ఆశీర్వాదాలతో గత ఐదేళ్ల పరిపాలన కాలంలో తనకు వెన్నంటే నిలిచి ప్రోత్సహించి నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్క వైసీపీ నాయకులకు, కార్యకర్తకు, ప్రజలు అందరికీ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడమే కాకుండా గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా మీ అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా ఇబ్బంది కలిగిన తానున్నాననే విషయాన్ని ఎవరు మరువరాదని అలానే నియోజకవర్గ ప్రజలకు ఎవరికీ ఏ ఇబ్బంది కలిగిన ఏ సమస్య పరిష్కారానికైనా తన వంతుగా ఎల్లప్పుడూ కృషి చేయడం జరుగుతుందని ప్రజా సమస్యలపై వారి గొంతుకుగా నిలిచి పోరాడడం జరుగుతుందని తెలియజేశారు.ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మండల ఎంపీపీ మజ్జి శోభారాణి, సీనియర్ నాయకులు పోల సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, కౌన్సిలర్ సభ్యులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యకేసులో ముద్దాయి అరెస్టు

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలోని హడ్కోకాలనీలో మంగళవారం సాయంత్రం తమ్ముడిని అన్నకత్తితో పొడిచిన సంఘటనలో ముద్దాయి గుజ్జల రవీంద్ర కుమార్ ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు పార్వతీపురం సిఐ కంటి రవికుమార్ తెలిపారు. అరెస్టు చేసిన ముద్దాయిని పూర్తి వివరాలతో కలిపి విజయనగరం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.హడ్కోకాలనీకి చెందిన గుజ్జల రవీంద్ర కుమార్ తనతమ్ముడు గుజ్జల హేమంత్ ల మధ్య నిర్మాణంలో ఉన్న ఇంటిలో భద్రపరిచిన కలప కోసం తగాదాతో కత్తెరతో మెడపై పొడిచినందున మంగళవారంనాడు ఆసుపత్రికి తీసుకువెళుతున్న సమయంలో మరణించిన సంగతి తెలిసిందే. 24 గంటల్లో పోలీసులు కేసును నమోదుచేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. సిఐతో పాటు ఎస్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా తీర్పు.. ఎన్డీఏ కూటమి గెలుపు

విశాలాంధ్ర - విఆర్.పురం : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజడంఖా మోగించి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ని చిత్తు చిత్తుగా ఓడించి విజయకేతనం ఎగురవేసిన టీడీపీ గెలుపుతో, మండల పరిధిలోని వడ్డీగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ముత్యాల రాజారావు తన నివాసం వద్ద కుటుంబ సభ్యులు, గ్రామస్తుల మధ్య కేక్ కటింగ్ చేసి టీడీపీ విజయోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల చంద్రశేఖర్, సిద్ధూ, కోట్ల రాజు, ముత్యాల శంకర్, పట్టి శంకర్, కాపారపు గాంధీ, ముత్యాల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన రంజిత్ కుమార్

విశాలాంధ్ర - కురుపాం : యువ గళం రథ సారథి శంఖారావం తెలుగు దేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిసి మాజీ ఎఎంసి చైర్మన్, యువ గళం సభ్యులు కోలా రంజిత్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో యువత భవిష్యత్తు కోసం, అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లు కీలకంగా పని చేసి నిరాశ తో ఉన్న ప్రజలు జీవితాల్లో వెలు గులు నింపేందుకు కూటమి పని చేయనుందని అన్నారు.

ఎమ్మెల్యేగా విజయం సాధించిన విశ్వేశ్వరరాజుకు ఘన సత్కారం

పంచాయతీ వార్డు సభ్యుడు సదాశివ, సీనియర్ నాయకుడు బాబురావు

విశాలాంధ్ర - చింతపల్లి : సార్వత్రిక ఎన్నికలలో పాడేరు నియోజక వర్గ వైకాపా శాసన సభ్యునిగా నూతనంగా ఎన్నికైన మత్స్యరాస విశ్వేశ్వర రాజు ను తాజంగిలో ఆ పార్టీ శ్రేణులు బుధ వారం ఘనంగా సత్కరించారు. మంగళ వారం వెలువడిన ఎన్నికల ఫలితాలలో పాడేరు నియోజకవర్గంలో ఘన విజయం సాధించి బుధవారం తాజంగి విచ్చేసిన ఆయనకు ఆ పంచాయతీ వార్డు సభ్యుడు కిల్లో సదాశివ, సీనియర్ నాయకుడు బాబురావు ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలో వైకాపా హ్యాట్రిక్ విజయం నమోదు చేయడం శుభ పరిణామం అన్నారు. గడచిన ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అందించిన సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ వైకాపాను ఆదరించారన్నారు. అనంతరం విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ ఈ విజయం పార్టీ శ్రేణుల సమిష్టి విజయం అన్నారు. రాబోవు రోజులలో మన్యప్రాంత అభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, తన విజయానికి అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా విశ్వేశ్వర రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోరాబు అంగదరావు, లింగనబాబు. బిసాయిశంకర్. రమణ. సోమరాజు. పులిమెట్ల బాబురావు. అప్పలరాజు, చంద్రావు, గోపాల్, రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో టీడీపీ సంబరాలు

విశాలాంధ్ర - అనంతగిరి : రాష్ట్రంలో టీడీపీ (ఎన్డీఏ కూటమి) ప్రభంజనం ప్రజా సంక్షేమం కోసమే అనంతగిరి మండల తెలుగుదేశం నాయకులు. అన్నారు చరిత్రాత్మక విజయాన్ని సాధించడంతో కేకు కట్ చేసి సంతోషం పంచుకున్నరు. ఈ సందర్భంగా పార్టీ ప్రెసిడెంట్ బుజ్జిబాబు మాట్లాడుతూ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఏజెన్సీ అభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రతి కార్యకర్తకు గౌరవ లభించిందన్నారు. పార్టీని ఎప్పటిలాగే బలోపేతం చేసి ప్రతి కార్యకర్తను టిడిపి జెండాగా తయారు చేస్తామని తెలిపారు. సంబరాల్లో పార్టీ జనసేన మండల ప్రెసిడెంట్ మురళి. టీడీపి సీనియర్ నాయకులు తెడపారికి ఆనందరావు. మోస్య జోగులు. సమ్మరెడ్డి గురువులు. మోస్యరంజిత్. మట్టం శ్యాం. మహిళా నాయకుల లక్ష్మి. రమేష్.బిడ్డ దేముడు. సోములు. సుందర్‌రావు, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమి షనర్ కె. శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా బుధవారం సౌందర్య నారాయణ మూర్తి నగర్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమందరం కలిసి మన పర్యావరణాన్ని రాబోయే తరాల కోసం కాపాడు కోవాలన్నారు. స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు మరియు అన్ని జీవులకు ఉజ్వల భవిష్యత్తు కోసం మనం తప్పకుండా పర్యావరణాన్ని రక్షించుకో వాలన్నారు. స్థిరమైన రేపటి కోసం ఈరోజే మార్పుకు బీజాలు వేద్దాం అన్నారు.త్వరలో పార్క్ అభివృద్ధి కోసం నిధులను కేటాయించుటకు ప్రయత్నిస్తామని తెలిపారు. పట్టణంలో మెయిన్ రోడ్డులో షాపులు ఉన్న వ్యాపారస్తులు తమ షాప్ ముందు డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని లేనియెడల ఫైన్ వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ కిరణ్, సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు మరియు ఎస్ఎన్ఎమ్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ రోజు సాలూరు రేంజి మక్కువ సెక్షన్ లో మక్కువ సెక్షన్ అధికారి కె.నారాయణరావు .మరియు వారి సిబ్బంది ఒడిసిలమెట్ట ఏ.ఎన్.ఆర్.10 ప్లాంటేషన్ లో500 మొక్కలు మరియు భాగుజోల 5 ఏ.ఎన్.ఆర్.ప్లాంటేషన్‌లో 2000 మొక్కలు నాటడం జరిగినది రమణ.సతీష్. గణపతి. మరియు బేసుక్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంలో కొత్తవారికే ఎంఎల్ఏలుగా తీర్పునిస్తున్న ఓటర్లు

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం శాసనసభ నియోజక వర్గం 2009లో పునర్విభజన జరిగిన తర్వాత ఎస్సీనియోజక వర్గముగా ఏర్పడిన తరువాత జరిగిన గత నాలుగు ఎన్నికల్లో కొత్త వారికే ఎమ్మెల్యేలుగా ఓటర్లు అవకాశం ఇస్తున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన సవరపు జయమణి, 2014లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన బొబ్బిలి చిరంజీవులు, 2019లో వైఎస్ఆర్సిపి నుండి పోటీ చేసిన అలజంగి జోగారావు, 2024లో తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి ఉమ్మడి పార్టీల తరఫున పోటీ చేసిన బోనెల విజయ్ చంద్రలు ఎమ్మెల్యేలుగా ఓటర్లు అవకాశం ఇచ్చారు. ఎమ్మెల్యేలు అయ్యాక రెండోసారిపోటీకి దిగిన బొబ్బిలి చిరంజీవులు, అలజంగి జోగారావులు ఓటమి పాలయ్యారు. 1994లో యర్రాకృష్ణమూర్తి, 1996లో యర్రా అన్న పూర్ణమ్మ, 1999లో మరిశర్ల శివన్నాయుడు, 2004లో శత్రుచర్ల విజయరామరాజులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. పార్వతీపురం నియోజకవర్గంలో 30ఏళ్లుగా ఇదే సెంటిమెంట్ కొనసాగుతుంది. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి మరోసారి పోటీ చేసిన గెలవలేక పోతున్నారు.2009లో పునర్విభజన జరిగిన పార్వతీపురం రానున్న 2029 ఎన్నికలకు ముందు పునర్విభజన జరిగి జనరల్ గా మారే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు తెలియజేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో 2029 ఎన్నికలు దీటుగా జరగనున్నాయని వారు తెలియజేస్తున్నారు.

ఎమ్మెల్యే సంధ్యారాణి గ్రామ దేవతకు పూజలు..

సాలూరు ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటాను...

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన సాలూరు ఎమ్మెల్యే సంధ్యారాణి. గ్రామదేవత శ్యామలాంబకు,కామాక్షి అమ్మ వారికి, కన్యకా పరమేశ్వరికి బుధవారం నాడు ఎమ్మెల్యే గా గెలిచిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఈవో రమేష్ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె కామాక్షి అమ్మవారికి, కన్యకా పరమేశ్వరికి పూజలు చేసి మొక్కుబడులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంధ్యారాణి మాట్లాడుతూ సాలూరు ప్రాంత ప్రజలు నన్ను నమ్మి గెలిపించారు. నేను ప్రజల పట్ల, బడుగు బలహీనుల పట్ల, పేద రోధ అనే తేడా లేకుండా, ఏ పార్టీతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి సహాయం అందిస్తానని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. అలాగే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని గెలిపించి ప్రజలకు. సాలూరు నియోజకవర్గం లో నన్ను గెలిపించిన అభిమానులు కార్యకర్తలకు ప్రజలకు శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికి మేము, మా పార్టీ కచ్చితంగా నిలబడుతుందని ప్రతి ఒక్కరికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కృతజ్ఞతలు కృతజ్ఞులై ఉంటానని తెలియజేశారు. అనంతరం సంధ్యారాణికి ఆలయం వద్ద ఆమె నివాసం వద్ద అభినందనలు తెలియజేస్తూ సత్కరించారు.

సమిష్టి కృషి సత్ఫలితాన్ని ఇచ్చింది

వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్

విశాలాంధ్ర - చింతపల్లి : సార్వత్రిక ఎన్నికలలో వైకాపా శ్రేణుల సమిష్టి కృషి సత్ఫలితాన్ని ఇచ్చిందని వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ అన్నారు. పాడేరు నియోజకవర్గం లో మత్స్యరాస విశ్వేశ్వర రాజు విజయం సాధించిన శుభ సందర్భాన్ని పురస్క రించుకుని ఆ పార్టీ ఎస్ టి సెల్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, జీకే వీధి మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, కార్యదర్శి వంతల బాబురావు, సర్పంచ్ల ఫోరం జీకే వీధి మండల అధ్యక్షుడు కే రామకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ జల్లి హలియా రాణి లతో కలిసి ఆయన కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులతో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి గిరిజన జాతి పూర్తి మద్దతుగా నిలిచిందన్నారు. పాడేరు నియోజకవర్గంలో వైకాపా అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు తన సమీప ప్రత్యర్థి ఎన్డీఏ కూటమి తెదేపాకు చెందిన గిడ్డి ఈశ్వరి పై 19 వేలకు పై చిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం సంతోషకరమన్నారు. కేవలం చింతపల్లి మండలంలోని వైకాపాకు ఏడు వేలకు పైగా మెజార్టీ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన నాలుగు మండలాల కన్నా చింతపల్లిలోనే 7వేల పైచిలుకు మెజార్టీ రావడం సమిష్టి కృషివలనే సాధ్యమైందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పాడేరు తోపాటు అరకు శాసనసభ, పార్లమెంటు స్థానాలలోను వైకాపా విజయ దుందుభి మోగించడం మన్యవాసులకు వైకాపా పై ఉన్న నమ్మకానికి నిదర్శనం అన్నారు. మన్యంలో ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విశ్వేశ్వర రాజు విజయానికి సమిష్టిగా కృషి చేయడం శుభ పరిణామం అన్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలకు కారణాలను వెతుక్కుని రాబోవు రోజులలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై చర్చించుకుని ప్రజల పక్షాన ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జికే వీధి మండల వైస్ ఎంపీపీ చప్పగడ్డ ఆనంద్, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరకు ఇర్మియ, ఎంపీటీసీ భీమరాజు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీపీఎంకు ఓటు వేసిన ప్రతి ఓటరకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - బెలగాం : ప్రజా సమస్యలపై పోరాడుతూ ఎన్నికల్లో పోటీచేసిన సిపిఎం కు ఓటు వేసిన ప్రజలకు అభినందనలు అని సిపిఎం పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు, అభినందనలు తెలుపుతున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. జిల్లాలో సిపిఎం పార్టీ నుండి పోటీ చేసిన అరకు పార్లమెంట్ ఎంపి అభ్యర్థి పి. నరసరావు, కురుపాం అసెంబ్లీ అభ్యర్థి మండంగి రమణకు ఓట్లు వేసి ఎన్నికల్లో పార్టీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహక రించిన వారందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన భారాలు, విచ్చలవిడి అవినీతి, అరాచక పాలన, నిరంకుశ విధానాల పట్ల ప్రజాగ్రహం వ్యక్తమైందని, ఇది ఫలితాల్లో ప్రతిభింబించిందన్నారు. రాష్ట్రంలో బిజెపి పోటీ చేసిన ఆరు పార్లమెంటు స్థానాల్లో మూడు స్థానాల్లో ఓడించడం రాష్ట్రానికి కేంద్రం చేసిన ద్రోహానికి ప్రజల స్పందన అని, రాష్ట్రంలో రెండు శిబిరాల మధ్య హెూరా హెూరీ పోటీ నడిచిన నేపథ్యంలో 'ఇండియా బ్లాకు' పార్టీలకు ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదని అయినా అరకు పార్లమెంటులో సిపిఐ (ఎం) కు లక్షకు పైగా ఓట్లు రావడం హర్షణీయమన్నారు. రంపచోడవరం అసెంబ్లీ స్థానంలో గతంకన్నా ఓట్లు పెరిగాయని, అలాగే సిపిఐ (ఎం) పోటీ చేసిన ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మిగతా రాష్ట్రంలో ఇండియా బ్లాకు పార్టీలకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

విశాలాంధ్ర - పార్వతీపురం : 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్వతీపురం శాసనసభ నియోజకవర్గంలోని ఎనిమిది మంది అభ్యర్థులు పోటీచేయగా వారికి వచ్చిన ఓట్ల వివరాలను రిటర్నింగ్ అధి కారైన పార్వతీపురం ఆర్డీవో కే హేమలత ప్రకటించారు.టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి పార్టీల నుండి ఎంఎల్ఏ గా పోటీచేసి విజయం సాధించిన బోనెల విజయ్ చంద్రకు ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి 83 వేల 905 ఓట్లురాగా, వైయస్సార్సీపి నుండి పోటీచేసిన అలజింగి జోగారావుకు 59వేల 491ఓట్లు వచ్చాయి. బహుజన సమాజ్ పార్టీ నుండి పోటీ చేసిన కుప్పల వెంకటరమణకు 954 ఓట్లు, భారత జాతీయ కాంగ్రెస్ నుండి పోటీ చేసిన బత్తిని మోహనరావుకు 1640 ఓట్లు, జై భీమ్ రావు భారత్ పార్టీ నుండి పోటీచేసిన గుంట జ్యోతికు 626 ఓట్లు, జై భారత్ నేషనల్ పార్టీ నుండి పోటీ చేసిన పొట్నూర్ కిరణ్ కుమార్ కు 299 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన గర్భాపు ఉదయభాను కు 654 ఓట్లు గర్భాపు మోహనరావుకు 599 వచ్చాయి. నోటాకు 3465 ఓట్లువేశారు. పార్వతీపురం నియోజకవర్గంలోని ద్వారా లక్షా 48వేల 783ఓట్లు , పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2850 ఓట్లు పోలయ్యాయి. ఇదిలా ఉండగా పార్వతీపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన బోనెల విజయ్ చంద్రకు రిటర్నింగ్ అధికారి హేమలత ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. బోనెల విజయ్ చంద్ర 24వేల 514 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.ఇదిలా ఉండగా విజయ్ చంద్ర రాజకీయాలకు కొత్తఅయినప్పటికీ, పదినెలల క్రితం పార్వతీపురం టీడీపీ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన నుండి నిరంతరం కష్టపడి పనిచేసి పార్టీ టిక్కెట్ ను చేజిక్కించుకున్నారు. ఉమ్మడి పార్టీల అభ్యర్థిగా ఘనవిజయం సాధించారు. ఆయన 1985 జూలై 10 జన్మించగా బీటెక్ చదువుకున్నారు. ఎస్సీ మాదిగ కులానికి చెందిన విజయ్ చంద్ర తనదైన రాజకీయ చాణక్యముతో అందరితో కలిసి ఉంటూ,నిర్ణయం తీసుకునే సమయంలో తనకు తానుగా తీసుకొని ముందుకు సాగారు. గత పది నెలలుగా తనదైన శైలిలో రాజకీయాలను నిర్వహించి విజయాన్ని చేజెట్టించుకున్నారు. ఆయనకు భార్య అనూషతోపాటు ఇద్దరు చిన్నపిల్లలున్నారు. ఎన్నికైన విజయ్ చంద్రుని నియోజకవర్గం మూడు మండలాలనుండి ,పురపాలక సంఘం నుండి నాయకులు, నేతలు, ప్రజా ప్రతినిధులు,అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, శ్రేయోభిలాషులు తండోలుగా వచ్చి అభినందనలు తెలియజేశారు.

మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర. వి.ఆర్.పురం : మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్స వాణ్ణి అటవీ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక రేఖపల్లి అటవీ కార్యాలయం వద్ద మొక్కలు నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసి మాట్లాడుతూ ప్రకృతికి మానవుడికి అవినాభావ సంబంధ ముందని, అది ఎంత దగ్గర సంబంధమంటే మనిషి ప్రకృతిలో పుడతాడు, ప్రకృతిలో ఆడుతూ పాడుతూ పెరుగుతాడు, ప్రకృతిని ఉపయోగించుకుంటూ ఎదుగుతాడు, చివరకు తన స్వార్థం కోసం ప్రకృతిని నాశనం చేయడానికి కూడా సిద్ధపడతాడని, పర్యావరణాన్ని పాడు చేస్తే మానవ వినాశనం తప్పదని,పర్యావరణాన్ని పరిరక్షించటం అందరి బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాసరావు, బొర్రా నరేష్ కుమార్, బి ప్రకాశరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె శ్రీనివాస్, సబ్ డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ కూనవరం కె వి విఎస్ రాఘవరావు, డిఆర్ఓ కె అబ్బులు, డిఆర్ఓ ధర్మారావు, ఎఫ్ఎస్ఓ నాగమణి తదితర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మిన వారికి ప్రాణం ఇచ్చే ప్రజలు గిరిజనులు

అల్లూరి జిల్లాలో వైకాపాకు హ్యాట్రిక్ విజయాలు

విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

మంచి చేసిన అధినేతకు కష్ట కాలంలో అండగా ఉందాం

వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి : సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో ఎవరు ఊహించని విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఫలితాలు వెలువడినప్పటికీ అల్లూరి జిల్లాలో అటు అరకు పార్లమెంట్, ఇటు అరకు, పాడేరు శాసనసభ స్థానాలను వైకాపా కైవసం చేసుకోవడం ఆశించిన పరిణామమేనని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నియోజకవర్గాలకు, మన్య ప్రాంతంలో ఉన్న నియోజకవర్గాలకు ఎంతో తేడా ఉంటుందన్నారు. నమ్మిన వారికి ప్రాణం ఇచ్చే ప్రజలు గిరిజనులు అన్నారు. రాజకీయ విశ్లేషకులకు, రాజకీయ పార్టీలకు, ప్రజలకు అంతు చిక్కని రీతిలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫలితాలలో అనేక జిల్లాలలో వైకాపాకు ఒక్క స్థానం కూడా దక్కకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. అటువంటి క్లిష్ట పరిస్థితులలోనూ అల్లూరి జిల్లాలో అరకు పార్లమెంట్ సహా అరకు, పాడేరు శాసనసభ స్థానాలలో వైకాపా విజయం సాధించడం చరిత్ర అన్నారు. 2014 నుంచి 2019, 2024 ల లోను అభ్యర్థులు ఎవరైనప్పటికీ మూడు దఫాలుగా ఈ నియోజకవర్గాలలో వైకాపా విజయాలు నమోదు చేస్తూ వస్తుందన్నారు. నేడు హ్యాట్రిక్ విజయాలతో అరకు పార్లమెంట్లో గుమ్మ తనూజ రాణి, అరకు, పాడేరు శాసనసభ స్థానాలలో రేగం మచ్చలింగం, మత్స్యరాస విశ్వేశ్వర రాజు లను గెలిపించు కోవడం జరిగిందన్నారు. ఉపకారికి అపకారం చేసే ఆలోచన గిరిజనులు ఏనాడూ చేయరన్నారు. మన్య ప్రాంతంలో వైకాపాకు వచ్చిన ఫలితాలే అందుకు ఉదాహరణ అన్నారు. వైకాపా ప్రభుత్వంలో పథకాలు పొందిన మన్య ప్రాంతంలోని గిరిజనులందరూ వైకాపా వెంటే ఉన్నారని అల్లూరి జిల్లాలో ఫలితాలు వెల్లడించా యన్నారు. వైకాపా ప్రభుత్వంలో గడచిన ఐదేళ్లు చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలతో పాటు గడపగడపకు మన ప్రభుత్వం పేరిట ప్రతి ఒక్క కుటుంబాన్ని పలకరించి పథకాలు అందుతున్న తీరును తెలుసుకోవడంతోపాటు అందని వారికి ఎందుకు అందడం లేదో తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించి పథకాలు అందజేసిన తీరును మెచ్చుకున్న మన్యవాసులు పొందిన లబ్ధికి కృతజ్ఞతగా వైకాపాకు విజయం చేకూర్చా రన్నారు. ఈ విజయంలో ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. ప్రజా ప్రతినిధులే గాక, నామినేటెడ్ పదవులలో ఉన్నవారు నాయకులు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా శ్రమించడం వలన రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫలితాలకు భిన్నంగా మన్యంలో ఫలితాలు నమోదయ్యాయన్నారు గడచిన 10 ఏళ్లుగా వైకాపా వెంట ఉన్న గిరిజనులు మరో ఐదేళ్ల పదవీ కాలానికి గాను వైకాపా అభ్యర్థులకు విజయం అందించారన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులంతా సంయమనముతో ఉండాలన్నారు. ఎక్కడ ఎటువంటి నిరుత్సాహానికి లోను కాకుండా పార్టీ అధినేతకు అండగా ఉంటూ అధికార పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కృషి చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫలితాలకు భిన్నంగా అల్లూరి జిల్లాలో విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికి అల్లూరి జిల్లా అధ్యక్షురాలిగా పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు

దొంతు మంగేశ్వరరావు

విశాలాంధ్ర-ఎటపాక: చంద్రన్న పాలన రాబోతుందని వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఆకాండ విజయం సాధించింది. దాంతో తెలుగు తమ్ముళ్లు సంబరాలు జరుపుకుంటున్నారు. రంపచోడవరం నియోజకవర్గం గడ్డ పై టీడీపీ జండా ఎగరడంతో ఎటపాక మండలంలో వైస్ యంపిపి దొంతు మంగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు జరు పుకుంటున్నారు. ముందుగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా దొంతు మంగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభు త్వంలో అరాచకాలు, అన్యా యాలు తప్పా అభివృద్ధి ఎక కనిపించలేదు అని, అభివృద్ధి, సంక్షేమలు అందించే వారికే రాష్ట్ర ప్రజలు పట్టం కట్టుతారు అని ఆయన అన్నారు.

పార్వతీపురం, బొబ్బిలి ఎమ్మెల్యేలకు అభినందనలు వెల్లువ

విశాలాంధ్ర-సీతానగరం/పార్వతీపురం/బలిజిపేట: పార్వతీపురం, బొబ్బిలి ఉమ్మడి పార్టీల తరఫున ఎమ్మెల్యేలుగా పోటీచేసి గెలుపొందిన బోనెల విజయ్ చంద్ర, ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబీనాయన) లను పార్వతీపురం నియోజకవర్గంలోని పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం పురపాలక సంఘాలపరిధిలోఉన్న టిడిపి, జనసేన, బిజెపిప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు కార్యకర్తలు మహిళలు శ్రేయోభిలాషులు పెద్దఎత్తున తరలివెళ్లి కలిసి పుష్పగుచ్ఛాలను అందజేస్తూ దుశ్శాలువాలు కప్పి అభినందనలు తెలియజేస్తున్నారు. గతంలో ఎన్నికలపూర్తయ్యాక,ఫలితాలు వచ్చాక కేవలం నాయకులు మాత్రమే వెళ్లేఆనవాయితీ ఉండగా, నేడు వారితో పాటు ఓట్లువేసిన ప్రతీకార్యకర్త, అభిమాని వాహనాలద్వారా తరలివెళ్లి అభినందనలు తెలియజేయడం గమనార్హం. ఇదిఇలా ఉండగా పార్వతీపురం నియోజకవర్గంలోని ప్రతీ ఒక్కరు బొబ్బిలి కోటకు వెళ్లి బేబి నాయనకు, అతని అన్నయ్య మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావులకుఅభినందనలు తెలియజేయడం గమనార్హం. ఇదిలా ఉండగా పార్వతీపురం, విజయనగరం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు అభిమానులు పెద్దఎత్తున బొబ్బిలి కోటకువెళ్లి బేబీనాయన అభినందనలు తెలియజేస్తున్నారు. బేబీ నాయనకు టీడీపి అదినేత చంద్రబాబునాయుడు తనకేబినెట్లో మంత్రి పదవి ఇవ్వడం ఖాయమని అందరి నోట వినిపిస్తుంది. బేబీనాయనకు మంత్రి పదవి రావడం వలన ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వారంతా ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని కూడా వారంతా కోరుతున్నారు ఇదిలాఉండగా పార్వతీపురం మన్యంజిల్లాలోని గిరిజన కోటాక్రింద

సాలూరు ఎమ్మెల్యేగా గెలిచిన టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణికి కూడా మంత్రిపదవి ఒరించే అవకాశాలు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. మరోవైపు అనూహ్యంగా 10 నెలలక్రితం టిడిపి ఇన్చార్జిగా రంగప్రవేశం చేసి ఎమ్మెల్యేగాగెలిచి లోకేష్ టీంలో క్రియాశీలకంగా ఉండే పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర కూడా ఎస్సీ కేటగిరీలో మంత్రి పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ కు సన్మానం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : ఆనందంలోనూ కష్టసుఖాల్లోనూ మానవతా దృక్పథంతో అంద రి బంధువునై ఉంటానని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమల్ ఖాన్ పేర్కొన్నారు బుధవారం వడ్డీగూడెం గ్రామస్తులను కలిసి తెలుగుదేశం అఖండ విజయానికి తోడ్పడినందుకు తన మాటకు కట్టుబడి ఉన్నందుకు ఆ సంతోషాన్ని పంచుకునేందుకు వడ్డెగూడెం గ్రామానికి రావడం జరిగిందని అన్నారు. ఆనందాన్ని పంచుకోవడం అందరి మధ్య ఉండాలని కోవడం ఆప్తులను కలుసుకోవడం మించిన ఆనందం లేదన్నారు. జమాల్ ఖాన్ సేవలను పొగుడుతూ వరదల సమయంలో కష్టకాలంలో ఎంతో సహాయ సహకారాలు అందించారని తమకు గ్రామ ప్రజలుఎంతో రుణపడి ఉన్నామని తెలియజేశారు. అనంతరం మహిళలు జమాల్ ఖాన్ ను శాలువాలతో సన్మానించినారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముత్యాల రామారావు, వాళ్ల రంగారెడ్డి, నర్ప రాజు , షరీఫ్, సూఫీ, ఎడవల్లి భాస్కర్, ఆచంట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మన్యవాసులంతా వైకాపా వెంటే ఉన్నారని మరో మారు రుజువైంది

ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి, మత్స్యరాజు దంపతులు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యవాసులంతా వైకాపా వెంటే ఉన్నారని మరో మారు రుజువయిందని ఆ పార్టీ చింతపల్లి ఎంపీటీసీ సభ్యురాలు దాసరి దారలక్ష్మి, మత్స్యరాజు దంపతులు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్రమంతా ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఫలితాలు వెలువడినప్పటికీ అందుకు భిన్నంగా మన్యంలో ఫలితాలు వైకాపాకు అనుకూలంగా రావడం హర్షనీయమన్నారు. పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలిగా ఉంటూ చేసిన కృషి, వైకాపా ప్రభుత్వం అందించిన సంక్షేమం మరువని మన్యవాసులు వైకాపా వెంటే ఉండి అరకు పార్లమెంట్, అరకు, పాడేరు శాసనసభ స్థానాలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైకాపా అభ్యర్థులైన గుమ్మ తనుజా రాణి, రేగం మచ్చలింగం, మత్స్యరాస విశ్వేశ్వర రాజు లకు అఖండ విజయాన్ని అందించారన్నారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన అరకు పార్లమెంట్ సభ్యురాలు తనూజ రాణి, పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజులకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు.

వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలికి అభినందనలు

అరకు పార్లమెంట్, అరకు, పాడేరు శాసనసభ స్థానాల విజయంలో కీలకపాత్ర పోషించిన భాగ్యలక్ష్మిని అభినందించిన ఎంపీపీ అనూష దేవి.

విశాలాంధ్ర-చింతపల్లి : వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలి హొదాలో సార్వత్రిక ఎన్నికలలో అరకు పార్లమెంట్, అరకు, పాడేరు శాసనసభ స్థానాలను కైవసం చేసుకుని జిల్లాలో వైకాపాకు తిరుగులేదని మరోమారు నిరూపించిన ఆ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మిని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడచిన ఐదేళ్లు వైకాపా ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసిన భాగ్యలక్ష్మి నేడు అల్లూరి జిల్లా అధ్యక్షురాలి హొదాలో జిల్లాలో తన రాజకీయ చతురతతో ఒక పార్లమెంటు, రెండు శాసనసభ స్థానాలను గెలిపించుకుని ఎన్డీఏ కూటమి సృష్టించిన సునామీలోనూ అల్లూరి జిల్లాలో తమకు ఎదురులేదని, మన్య ప్రాంత ప్రజలంతా వైకాపా వెంటే ఉన్నారని మరో మారు నిరూపించారన్నారు. ఆమెకు టికెట్ కేటాయించలేదని ముందు బాధపడినప్పటికీ, ఆమెపై అధినేతకు ఉన్న పూర్తి నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యత అప్పగించి ఆమెపై మరింత బాధ్యతను పెంచారన్నారు. అటువంటి పెద్ద బాధ్యతను సునాయాసంగా చేదించేందుకు అనునిత్యం శ్రమించిన భాగ్యలక్ష్మి కూటమి సునామీలో కూడా అల్లూరి జిల్లాలో ఒక పార్లమెంటు, రెండు శాసనసభ స్థానాల్లో విజయదుందుభి మోగించేందుకు కృషిచేసి సత్ఫలితాలు సాధించారన్నారు. ఈ ఫలితాలు ఆమె పనితనానికి నిదర్శనం అన్నారు.

గ్రామాల్లో దోమల నివారణ ఐఆర్ఎస్ మందు పిచికారీ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మండలం చందలంగి, బట్టివలస గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ (ఐఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి.జగన్ మోహనరావు బుధవారం పరిశీలించారు. ప్రతీ ఇంటికి స్ప్రేయింగ్ సక్రమంగా చేపడుతున్నదీ, లేనిదీ స్వయంగా తనిఖీ చేసారు. దోమల మందు ఎసిఎం రసాయనం వినియోగించిన మోతాదు, గ్రామంలో ఇళ్ల సంఖ్య తదితర వివరాలపై ఆరా తీశారు. మార్కింగ్ వేసిన ఇళ్లకు స్ప్రే జరిగిన తీరును గమనించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ గత నెల 15 నుండి మొదటి విడత స్ప్రేయింగ్ దోమల నివారణ చర్యలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జరుగుచున్నదనీ, పార్వతీపురం మండలం లో 36 గ్రామాలకు గాను ఇప్పటికి 26 గ్రామాలలో స్ప్రేయింగ్ పూర్తి అయ్యిందని తెలిపారు. వీటితోపాటుగా డ్రైడే కార్యక్రమాలు, ఫీవర్ సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్స్, శానిటేషన్ డ్రైవ్ మొదలగు దోమల నివారణ చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలను సకాలంలో గుర్తించడంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి. ధరణి, కార్యాలయ డెమో యోగీశ్వర రెడ్డి, ఈఓ వెంకటనాయుడు, సత్తిబాబు, సూపర్వైజర్లు శంకర్రావు, జయలక్ష్మి, ఎంటిఎస్ రామకృష్ణ, వైద్య సిబ్బంది బంగారినాయుడు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అరకు ఎంపీ అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలు

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాకేంద్రంలో ఉద్యానవన కళాశాలలో మంగళవారం జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల కౌంటింగులోఅరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన వారికి వచ్చిన ఓట్లవివరాలను అరకు పార్లమెంటు రిటర్నింగ్ అధికారైన జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలియజేశారు. వైయస్సార్సీపి తరఫున ఎంపీగా పోటీచేసి ఎన్నికైన గుమ్మడి.తనుజారాణికి నాలుగు లక్షల 77వేల55ఓట్లు రాగా, బిజెపి తరఫున పోటీ చేసిన కొత్తపల్లి గీతకు నాలుగులక్షల26వేల 425 ఓట్లు, వామపక్షాల నుండి ఎంపీగా పోటీ చేసిన అప్పలనరస పాలకొండకు లక్షా23వేల 129ఓట్లు వచ్చాయి. బీఎస్పీనుండి పోటీ చేసిన ఆవశ్యలహరికి 25వేల 750 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీచేసిన బాలకృష్ణకు 9535ఓట్లు, నిమ్మక జయరాజుకు 9462ఓట్లు, అతిథికి 8136 ఓట్లువచ్చాయి. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన చంటికు 7252 ఓట్లు, భారత్ ఆదివాసి పార్టీఅభ్యర్థిగా పోటీ చేసిన ఎం రాజబాబుకు 6766 ఓట్లువచ్చాయి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్ కుమార్ పాలకకు 6047 ఓట్లురాగా, టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాంబాబుకు 4959ఓట్లు, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మండల గిరిధర్ రావుకు 4967 ఓట్లురాగా, ఐపిబిపి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉయ్యక నిరీక్షణకు 4542ఓట్లు వచ్చాయి. అరకు పార్లమెంటు నుండి నోటాకు 50వేల 470 ఓట్లు పోలయ్యాయి. అరకు పార్లమెంట్ పరిధిలోని 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా వారందరికీ ఈవీఎంద్వారా 11 లక్షల 43వేల13ఓట్లురాగా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 21వేల 432 ఓట్లు వచ్చాయి. ఉత్తరాంధ్రలో మొదటిసారి ఎంపీ గా పోటీచేసిన డాక్టర్ తనూజా రాణి వైసీపీ నుండి అరకు ఎంపీగా ఎన్నికయ్యారు. అరకు ఎంపీ ఎన్ని కల్లో మొదటి సారిగా పోటీ చేస్తున్న కొత్త అభ్యర్థులు వరా (తా ప్ ఎంపీలుగా గెలుపొందడం అరకు రికార్డుగా గుర్తించవచ్చు. ఇదిలాఉండగా అరకు పార్లమెంట్ మూడుజిల్లాల్లో ఏడు శాసనసభ నియోజక వర్గాలు ఉండగా, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో కౌంటింగ్ జరగడం, రిటర్నింగ్ అధికారిగా పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారిగా పార్వతీపురం జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికలు వ్యవహరించారు. మొదటిసారిగా అరకు పార్లమెంట్ కౌంటింగ్ ప్రక్రియ మన్యంజిల్లాలో జరగడంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

ఎన్డీఏ కూటమి సృష్టించిన సునామీలో కొట్టుకుపోయిన వైకాపా...

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు

విశాలాంధ్ర-చింతపల్లి/పాడేరు: ఆంధ్ర రాష్ట్రం లో ఎన్డీఏ కూటమి సునామీ సృష్టించిందని, ఆ సునామీలో వైకాపా కొట్టుకుపోయిందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు అన్నారు. మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో ఊహించని రీతిలో అంచనాలకు మించి 13 జిల్లాలలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ నాయకులతో కలసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదం తో పాటు సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి చొచ్చుకు పోవడం వల్లనే తెదేపాకు తిరుగులేని ఆదిత్యత లభించింది అన్నారు. ఎన్డీఏ కూటమి సృష్టించిన సునామీలో వైకాపా కొట్టుకుపోయిందన్నారు. తెదేపాకు ఏకపక్షంగా 135 స్థానాలు రావడమే గాక, మిత్రపక్షమైన జనసేన 21 స్థానాలకు గాను 21 స్థానాలు క్లీన్ స్వీప్ చేయడం జరిగిందన్నారు. బిజెపి సైతం ప్రతి స్థానాలకు పోటీ చేసి ఎనిమిది స్థానాలలో విజయకేతనం ఎగురవేసిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు వర్తన పిన్నయ్య దొర, బీసీ విభాగం నాయకుడు కొణతాల ప్రశాంత్, మహిళలు పాల్గొన్నారు.

పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

విశాలాంధ్ర-పార్వతీపురం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో పాలకొండ శాసనసభ నియోజకవర్గంలోనిఏడుగురు అభ్యర్థులు పోటీచేయగా వారికి వచ్చిన ఓట్ల వివరాలను రిటర్నింగ్ అధికారైన సీతంపేట ఐటిడిఏ పిఓ సుభమ్ బన్సల్ ప్రకటించారు. జనసేన, టీడీపి,బిజెపి ఉమ్మడి పార్టీలనుండి ఎంఎల్ఏ గా పోటీచేసి విజయం సాధించిన జయకృష్ణ నిమ్మకకు ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి 75వేల208 ఓట్లురాగా, వైయస్సార్సీపి నుండి పోటీచేసిన విశ్వసరాయి కళావతికు 61వేల917ఓట్లు వచ్చాయి. బహుజన సమాజ్ పార్టీ నుండి పోటీ చేసిన ఉయ్యక బాలచందర్ కు1570 ఓట్లు, భారత జాతీయ కాంగ్రెస్ నుండి పోటీ చేసిన చంటిబాబు సవరకు 2041 ఓట్లు వచ్చాయి. జాతీయ జనసేన పార్టీకి చెందిన కృష్ణ నిమ్మకకు 1363ఓట్లు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జైపాల్ కద్రకకు 1025 ఓట్లు, గొండ్వాన దండకారణ్య పార్టీకి చెందిన బిడ్డిక ఉమామహే శ్వరరావుకు 991 ఓట్లు రాగా నోటాకు 4220 ఓట్లునువేశారు. పాలకొండ నియోజకవర్గంలోని ఇవిఎంల ద్వారా లక్షా 45వేల590ఓట్లు , పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2785ఓట్లు పోలయ్యాయి. ఇదిలా ఉండగా పాలకొండ ఎమ్మెల్యేగా ఎన్నికైన జయకృష్ణ నిమ్మక గతంలో రెండుసార్లు టిడిపి తరఫునఎంఎల్ఏగా పోటీచేసి ఓడిపోయారు.ఈఎన్నికల్లో పాలకొండ ఎమ్మెల్యే సీటును జనసేనకు కేటాయించగా, అనూహ్యంగా ఆయన తెలుగుదేశం పార్టీనుండి జనసేనలోకి వెళ్లడం,వెంటనే టిక్కెట్ కేటాయిం చడం, పోటీ చేయడంతో ఈఎన్నికల్లో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచిన జయకృష్ణకు రిటర్నింగ్ అధికారయిన సుభమ్ బన్సల్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. జయకృష్ణ 13వేల 291ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.ఇదిలా ఉండగా ఎమ్మెల్యేగా గెలిచిన జై కృష్ణ ఉన్నత విద్యాభ్యాసాన్ని అభ్యసించారు. 1979 ఆగస్టు 11న జన్మించారు. ఆయన తండ్రి నిమ్మకు గోపాలరావు గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయనకు తల్లి నిమ్మక రమణమ్మ, భార్య భాగ్యవతి, కుమారుడు జయనీల్ ఉన్నారు. ఎస్టీ కులానికి చెందిన జయకృష్ణ 2014,2019 లలో పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిడిపి తరఫున పోటీచేసి ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మంచి వ్యక్తిగా పేరు ఉన్న జయకృష్ణను మండలాలనుండి ,పురపాలక సంఘం నుండి జనసేన, టిడిపి,బిజెపినాయకులు, నేతలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, శ్రేయోభిలాషులు తండోలుగా వచ్చి అభినందనలు తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుండి జనసేన తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన జయకృష్ణను జిల్లాలోనిజనసేన సభ్యులు పెద్ద ఎత్తున కలిసి అభినందనలు తెలిపారు.

జగధీశ్వరి విజయానికి పనిచేసిన వారందరికీ ధన్యవాదాలు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్

పార్టీ అధిష్టాన ఆదేశాల శిరసా వహిస్తా...

కురుపాం నియోజకవర్గ అభివృద్ధే మా భాధ్యత

ఎమ్మెల్యే జగధీశ్వరి అందుబాటులో ఉంటూ సేవలు

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విజయం సాధించేందుకు సమన్వయంతో పని చేసి సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కు తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ధన్యవాదాలు తెలిపారు.ఎన్నికలు ఫలితాలు అనంతరం బుధవారం ఆయన నివాసం లో మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తన పై నమ్మకం తో ఆదేసించిన పని సమర్థవంతంగా నిర్వహించి 23500ఓట్లు మెజారిటీ తో ఎమ్మెల్యే జగధీశ్వరి ని గెలిపించుకున్నామని, విజయం సాధించడం తో తన టాస్క్ పూర్తి చేసి నట్టైందని అన్నారు. 1994ఎన్నికలు తర్వాత మూడు దశాబ్దాల కాలంగా తెలుగు దేశం పార్టీ వివిధ రకాల కారణాలు వలన సమర్థవంతంగా పనిచేసే కేడర్ ఉన్న విజయానికి నోచుకోలేదని అన్నారు. ఈదఫా పార్టీ ఆదేశాల ఎప్పటికప్పుడు కేడర్ తో సమాలోచనలు చేస్తూ పార్టీ బలోపేతానికి పనిచేసామని అదే విజయం రహస్యం అన్నారు.. కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలు ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధృష్టికి తీసుకుని వెళ్ళటం జరిగిందని ఎన్నికలు ముందు శతశాతం పరిష్కారం చేసేందుకు సహాకరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.ఇక పై ఎమ్మెల్యే జగధీశ్వరి తో కలిసి నియోజకవర్గ అభివృద్ధి చేయడమే ఏకైక లక్ష్యమని తెలిపారు.వైరిచర్ల ఆశయం గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.నియోజక వర్గం లో ఎన్నికల్లో తిరిగే సమయాల్లో వివిధ సమస్యలు ప్రజలు ద్వారా తెలుసుకున్నాన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దశలో వారీగా పరిష్కారం చేసేందుకు పని చేస్తామని తెలిపారు.

ఓటువేసిన వారందరికీ కృతజ్ఞతలు

ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం శాసనసభ నియోజకవర్గంనుండి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లకు,పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యేగా విజయం సాధించిన బోనెల విజయ్ చంద్ర తెలిపారు. తనను ఆదరించి గెలిపించడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తన వంతు నిరంతరం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని సమస్యలను తీసుకొని వాటిని ప్రణాళిక బద్ధంగా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో అభివృద్ధి వైపు ప్రయాణిస్తానన్నారు. నియోజకవర్గంలోని మూడుపార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయనన్నారు.తనవిజయానికి నిరంతరం కష్టపడి సైనికులవలే పనిచేసిన ఉమ్మడిపార్టీల నాయకులకు ,ప్రజాప్రతినిధులకు కార్యకర్తలకు, అభిమానులకు ,మహిళలకు, శ్రేయోభిలాషులకు, కృతజ్ఞతలు తెలియజేశారు. పార్వతీపురం నియోజకవర్గంలోని మూడుమండలాల తోపాటు పురపాలక సంఘంలో కూడా తనకు మంచిమెజార్టీని ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా కూడా ఉద్యోగులు కూడా పెద్ద ఎత్తున ఆదరించినందుకు వారికి కూడా కృతజ్ఞతలు తెలియజేశారు.ఇదిలా ఉండగా విజయ చంద్రను నియోజకవర్గంలోని సీతానగరం, పార్వతీపురం, బలిజిపేట మండలాలకు చెందిన టిడిపి జనసేన బిజెపి పార్టీలనేతలు పెద్దఎత్తున తరలివచ్చి అభినందనలు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి భాద్యత

విశాలాంధ్ర-పలాస: పలాస -కాశీబుగ్గ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డా.వి.కణితిన్ ఐ.టీ.ఐ. కళాశాల ఆవరణ లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులు పౌరులు భాద్యత తీసుకుని విరివిగా కళాశాలలు, పాఠశాలు, పార్కులలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటలని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రోనంకీ హేమాచలం, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు,వీరఘట్టం వెంకటరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కోకో పోటీలు

విశాలాంధ్ర- సంత బొమ్మాళి : సంతబొమ్మాలి శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థుల కు పర్యావరణం గురించి వివరించారు. అలాగే గ్రంథాలయ అధికారి కె రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు కోకో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజు శుక్రవారం బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.